
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 89 వ భాగం

### వృత్రాసుర వృత్తాంతం – 13, చిత్రకేతూపాఖ్యానం-1

వృత్రాసురుడు వజ్రాయుధం వల్ల పోయాక అతని శరీరంలోంచి వచ్చిన తేజస్సు విష్ణువులో కల్సిందని చదివాం క్రితం నెల వ్యాసంలో. అలా జరగడం నారాయణ కవచ ప్రభావంతో తయారైన వజ్రాయుధం వల్లా, లేకపోతే వృత్రుడు క్రితం జన్మలో విష్ణుభక్తుడా? అసలు ఈ కవచ ప్రభావం ఎంతటిది అనేది శుకమహర్షి వివరిస్తున్నాడు ఇప్పుడు.

సీ. మఱియుఁ బుట్టింపంగ మనసు పెట్టిన యట్టి;
క్రూరకర్మాంబోధి కుంభజుండు
అంగారములు చేయ నాహుతిఁ గన నోపు;
బహు పాపకానన పావకుండు
కందక దిగ మ్రింగి గబ్బునఁ ద్రేపంగఁ;
గల్మషగరళ గంగాధరుండు
ఘనగుహాంతరములఁ గాలూన నియ్యని;
కలుష దుస్తర తమో గ్రహ విధుండు [6-439]

ఆ. సకల ముక్తిలోక సామ్రాజ్య సమధిక
సహజ భోగ భాగ్య సంగ్రహైక
కారణాప్రమేయ కంజాక్ష సర్వేశ
కేశవాది నామ కీర్తనంబు. [6-439.1]

ఇంకా ఉంది ఈ నారాయణ మంత్ర వైభవం. చనిపోయే ముందు ఒక్కసారి 'నారాయణ' అన్నందుకే అజామీళుడు, తాను భగవంతుడి నామం ఉచ్ఛరిస్తున్నాడనీ తెలియకపోయినా, వైకుంఠానికి వెళ్ళాడు కనక ఈ నామ వైభవం ఎటువంటిదంటే, పునర్జన్మ కి కారణమైన కర్మలన్నింటినీ నశింపచేసేది. నారాయణుడు, అగస్త్యుడిలా కర్మలన్నింటినీ ఔపోసన పట్టి గుటుక్కున తాగగలడు. కాలకూటం మింగి ఏ మాత్రం అపాయం బారిన పడకుండా గర్రున తేన్చినట్టూ పరమశివుడైన గంగాధరుడివంటివాడు. కటిక చీకట్లనే పాపాలని పారదోలే సూర్యుడివంటివాడు. ఒక్క కేశవనామ కీర్తనం వల్లే సహజ భోగ

భాగ్యాలన్నీ కలుగుతాయి.  శుకమహర్షి ఇలా అనే సరికి పరీక్షిత్తుకో సందేహం. భగవంతుడి నామం గొప్పదే, దాని గురించి అజామీళోపాఖ్యానం లోనే విన్నాను, కానీ...

సీ. భూస్థలిఁ గల రేణువులకన్న దట్టమై;
కడు నొప్పు జీవసంఘములు గలవు;
ఆ జీవములలో ననరయ ధర్మాయత;
మతి వసించినవారు మనుజజాతి;
ఆ మనుష్యులలోనఁ గామంబుఁ బెడఁబాసి;
మోక్షార్థు లగువారు మొదల నరిది;
మోక్షమార్గం బాత్మమూలంబుగా నుందు;
వారిలో ముక్తులు లేరు తఱచు; [6-442]

తే. ముక్తు లై నట్టి వారిలో యుక్తిఁ దలఁపఁ
జాల దుర్లభుఁ డమిత ప్రశాంతి పరుఁడు
పరమ సుజ్ఞాన నిరతుండు భద్రగుణుఁడు
రమణ శ్రీవాసుదేవపరాయణుండు. [6-442.1]

భూమి మీద అనేకానేక జీవులు ఉన్నాయి మానవులతో సహా. అందులో కామం తో (కోరికలతో) బతికేవారే దాదాపు అందరూను. మోక్షం కావాలనుకునేవారు అతి తక్కువ. అలా అనుకున్నవారిలో అసలు ముక్తులు (జీవ మరణాల నుంచి తప్పించుకుని ముక్తులైనవారు లేదా మోక్షం పొందినవారు) దాదాపు ఎవరూ లేరనే అనుకోవచ్చు. అందువల్ల భగవద్భక్తి కలగడమే అసంభవంగా తోస్తుంది.

తే. సకలలోకాపకారి దుస్సంగతుండు
వృత్రుఁ డే క్రియ సుజ్ఞాన వేది యయ్యె?
సమరమునఁ బౌరుషంబుచే నమరవిభుని
నెట్లు మెప్పించె? దీని నాకెఱుఁగఁ జెపుమ. [6-443]

ప్రపంచంలో పరిస్థితి ఇలా ఉంటే రాక్షసుడూ, దుష్టులతో సాంగత్యం కలవాడూ అయిన వృత్రాసురుడికి భగవంతుడి గురించిన ఈ జ్ఞానం ఎలా వచ్చింది? రణరంగంలో పౌరుషంగా యుద్ధం చేస్తూ కూడా తన జ్ఞానంతో ఇంద్రుణ్ణి మెప్పించాడు కదా? అతను పోయాక వాడి శరీరంలోంచి తేజస్సు భగవంతుడిలో ఐక్యం అవడం చూసాం కూడా. అయితే ఇటువంటి జ్ఞానం అసురుడైన వృత్రుడికి ఎలా వచ్చింది?

పరీక్షిత్తు అడిగినదే కృష్ణుడు భగవద్గీతలో చెప్పడం గనించవచ్చు.

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తితత్త్వతః (భగవద్గీత 7.3)

వేలమంది మనుషులలో ఒకడు సిద్ధి కోసం ప్రయత్నం చేస్తాడు. అలా ప్రయత్నించిన సిద్ధులలో ఒక్కడు మాత్రమే భగవంతుణ్ణి యదార్ధంగా తెలుసుకోగలుగుతున్నాడు. ఈ వృత్రాసురుడు ఆ ఒక్కడు ఎలా అయ్యాడనేదే ఈ భాగవతం కధనం, పరీక్షిత్తు సందేహం.

చ. అమిత విభూతిఁ జాల నమరాధిపుఁ బోలుచు శూరసేన దే
శములకు భర్తయై ప్రజలు సంతస మందఁగ సార్వభౌముఁడై
క్షమ దమ కెల్ల కాలమును గామ దుహంబుగఁ జిత్రకేతు నా
మమునఁ బ్రసిద్ధి కెక్కె గుణమండనుఁ డంచిత కీర్తికాముఁడై. [6-445]

పరీక్షిత్తు ప్రశ్నకి శుకమహర్షి సమాధానం చెప్తున్నాడిప్పుడు. శూరసేన దేశాలకి చిత్రకేతువనే రాజు ఉండేవాడు. ఆయనకి ఉన్న క్షమ, దమాది లక్షణాలతో పరిపాలన బాగుండేది. వైభవంలో ఇంద్రుడిలాంటివాడు (అమరాధిపుడు – దేవతల నగరమైన అమరావతికి, లేదా దేవతలు/అమరులు కి అధిపతి)

ఉ. రూపము సత్ప్రతాపము మరుత్పతిభోగము యౌవనంబు సం
దీపిత చారువర్తనము దిగ్విజయంబును సత్యమున్ జగ
ద్వ్యాపిత కీర్తియున్ సతులు వైభవముఖ్యములెల్ల మాన్పగా
నోపక యుండె నా నృపతి నొందిన సంతతిలేని దుఃఖమున్. [6-448]

ఇంత గొప్పవాడైనా, ఎంతమంది రాణులున్నా రాజుకి పిల్లలు లేరు. గమనించారా ఒక విషయం. ఏమీ లేని బీదవాళ్లకి డబ్బులు కావాలనే కోరిక, అన్నీ ఉన్న రాజులకి మరేదో లేదని కోరిక. ఈ కోరికే అన్ని దుఃఖాలకీ కారణం. అందుకే ఈ ప్రపంచంలో సుఖం అనేది కాకి బంగారం వంటిది. దీనిగురించే తన దగ్గిరకి వచ్చిన దేవతలకి విష్ణువు చెప్పాడు, "... విశేషించి నాయందునేకాంతమతి యైన తత్త్వవిదుం దన్యంబులం గోరకుండు." ఎటువంటి కోరికైనా సరే దుఃఖహేతువు కనక ఎప్పుడు కూడా కోరుకోవాల్సింది భగవంతుడే కానీ మరొకటి కాదు. వివేకానందులు చెప్పినది దీనికంటే ఘనమైనది. భగవంతుణ్ణి కూడా కోరకండి. అప్పుడు ఆయనే మీ దగ్గిరకి వస్తాడు. దేనికీ, ఎవరినీ దేబిరించవల్సిన పని లేదు. మనతో సహా ఈ ప్రపంచం మొత్తం ఆ ఆత్మ చైతన్యమే, ఆ భగవంతుడే అని తెల్సినప్పుడు ఎవరిని ఇది కావాలి అది కావాలి అని అడగడం?

కధ ఇలా ఉండగా అంగిరసుడు అనే ముని రాజుదగ్గిరకి వచ్చి ఓ ఉపాయం చెప్పాడు పిల్లలు పుట్టడానికి. దాని ప్రకారం రాజు పుత్రకామేష్టి చేస్తే పిల్లలు పుడతారు. ఆయిన మాత్రం ఈ కుర్రాడితో నీకు కావాల్సిన సుఖం, దానికి సంబంధించిన దుఃఖం కలుగుతాయి అని ఆశీర్వచనం ఇచ్చాడు కూడా. అలా చిత్రకేతువు పట్టపురాణికి ఓ కొడుకు పుట్టాడు. మిగతా రాణులకి అసూయ పుట్టి ఆ పిల్లవాడికి విషంపెట్టి వాణ్ణి చంపేసారు. అంటే ఎలా పుట్టిన కుర్రాడు అలాగే పోయాడు. ఇప్పుడు తెల్సింది కదా, అసలు కోరికే ఎందుకు వద్దు అన్నారో వివేకానందులు? ఎందుకంటే కోరిక తీరితే దాని కూడా వచ్చే దుఃఖాలు వేరే ఉన్నాయి.

వ. అని తలమొల యెఱుంగక పలవించుచు, భృత్యామాత్య బంధుజనంబులం గూడి యడలుచు నున్న యా రాజు దుఃఖం బెఱింగి, యంగిరసుండు నారదునితోడం గూడి చనుదెంచి, మృతుండైన పుత్రుని పదతలంబున మృతుండునుం బోలెఁ బడియున్న యా రాజుం గనుంగొని, యిట్లనియె
[6-455]

కొడుకు పోయేసరికి రాజు ఇలా తలా, తోకా (తుదీ మొదలూ) లేకుండా ఏడుస్తున్న రాజు దగ్గిరకి మరోసారి ఆ అంగిరసుడు, నారదుడూ వచ్చారు. ఈ ఏడుపు చూసి రాజుతో ఇలా అంటున్నారు.

సీ. నీకు వీఁ డెవ్వడు? నీ వెవ్వనికి శోక-
సంతాప మందెదు? సార్వభౌమ!
పుత్ర మిత్రాదులు పూర్వజన్మంబున-
నెవ్వని వారలో యెఱుఁగఁ గలవె?
మొదల నదీవేగమున నాడ కాడకు-
సికతంబు గూడుచుఁ జెదరుచుండు;
నారీతిఁ బ్రాణుల కతికాల గతిచేతఁ-
బుట్టుట చచ్చుట పొసగుచుండుఁ; [6-456]

ఆ. గాన భూతములకుఁ గలుగు భూతంబులు
మమత తోడ విష్ణుమాయఁ జేసి
దీని కడల నేల? ధృతిఁ దూలఁగా నేల?
బుద్ధిఁ దలఁప వలదె? భూత సృష్టి. [6-456.1]

ఈ కుర్రాడు నీకేమౌతాడు? అసలు నీకు ఈ ఏడుపు ఎందుకు? నీ పూర్వ జన్మలో ఎవరు మిత్రులో ఎవరు పుత్రులో నువ్వు ఎరుగుదువా? నదిలో నీటి ప్రవాహానికి ఇసుక (సికతంబు) కొట్టుకు వస్తుంది, తర్వాత చెదిరిపోతుంది. అలాగే ప్రాణులు కర్మవసాన అలా కొట్టుకురావడం పుట్టడం చావడం జరుగుతోంది. ఇలా భూతజాలానికి కలిగే మాయ వల్ల పుట్టడం చావడం అనేవి కనిపిస్తున్నాయి. నిజంగా ఆలోచిస్తే ఇదంతా విష్ణుమాయ తప్ప మరొకటి కాదు.

నేను ఇంతకు ముందు వచ్చి నీచేత పుత్రకామేష్టి చేయించిన అంగీరసుణ్ణి. ఈయన నారదుడు. నీ దుఃఖం చూసి తత్వ జ్ఞానం ఉపదేశించాలని వచ్చాము. అలా కాదంటే నారదుడు ఈ కుర్రాణ్ణి బతికిస్తాడు చూడు అన్నాడు. నారదుడప్పుడు ఏమి చెప్పాడంటే "నేను ఉపదేశించిన మంత్రం జపిస్తూ సాధన చేస్తే భగవంతుడు కనిపిస్తాడు కానీ నీకు కొడుకే కావాలిస్తే, పోయిన అబ్బాయి కళేబరం అక్కడే ఉంది, ఆ కుర్రాడి ఆత్మని నేను పిలుస్తాను. ఏమౌతుందో చూడు," అని ఆ కుర్రాడి ఆత్మని పిలిచి ఇలా అన్నాడు. "ఒరే అబ్బాయి, ఈ కళేబరంలో ప్రవేశించి మీ అమ్మానాన్నలకీ సంతోషం కలిగిస్తూ ఈ రాజ్య భారం వహించు."

ఇటువంటి సంఘటనే ఒకటి బుద్ధుడి జీవితలో జరగడం గమనించవచ్చు. ఒకావిడ కొడుకు అర్ధాంతరంగా పోయాడు. ఎవరో చెప్పారుట భగవానుడు కుర్రాణ్ణి బతికించగలడని. వచ్చి అడుగుతుంది ఏడుస్తూ. "మరణం ప్రవేశించని ఎవరి ఇంట్లోంచైనా కొన్ని నువ్వులు తీసుకురా బతికిస్తాను" అంటాడు బుద్ధుడు. సాయంత్రం దాకా తిరిగితే ఆవిడకి తెలిసి వచ్చినదేమంటే మరణం అనేది జన్మం అంత సర్వసాధారణం. ఎక్కడా మరణం లేని ఇల్లనేదే లేదు. అప్పటికి అర్థం అవుతుంది ఆవిడకి, తన కొడుకు అర్ధాంతరంగా పోయాడని తాను అనుకున్నది నిజం కాదు. వాడి ఆయుష్షు అంతే. వాడి దారి వాడిదీ తనదారి తనదీ.

మన కథలో నారదుడు పిలిచాక అలా వచ్చిన కుర్రాడి ఆత్మ ఏమి చెప్పిందో వచ్చే వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS